క్లుప్తంగా

నేడు ఆడుదాం ఆంధ్రా యోగా కార్యక్రమం

తాడికొండ: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం తాడికొండలో సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ దొడ్డా సుధాకర్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయిలో తాడికొండ సత్యసాయి హైస్కూల్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ముఖ్య అతిథిగా పాల్గొని యోగా పోటీలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారని, అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈఓ తెనాలి ఇందిర, సచివాలయం 2 కార్యదర్శి రమ్య పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గొడవర్రులో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి



మంగళగిరి: దుగ్గిరాల మండలం గొడవర్రు గ్రామంలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ పొలం బడి నిర్వహించారు. రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులు, రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించడం వలన సాగు ఖర్చు తగ్గించడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం జరుగుతుందని అధికారులు వివరించారు. పొలం బడి ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు సీహెచ్ పవన్‌కుమార్, ఏ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటెల్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు



మేడికొండూరు: మండలపరిధిలోని పేరేచర్లలో ఉన్న ఇంటెల్ పాఠశాలలో శుక్రవారం సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.అశోక్‌రాణి జయకుమార్ పాల్గొని మాట్లాడారు. క్రిస్మస్ వేడుకలు విద్యార్థులతో కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తాడికొండ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడికొండ మండల ఎండీయూ ఆపరేటర్లు తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. పంపిణీలో తమకు వస్తున్న అవాంతరాలు, ఇబ్బందులకు సంబంధించిన సమస్యలు వినతిపత్రంలో పొందుపరిచామని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

తాడికొండ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం తుళ్లూరు మండలం వెంకటపాలెం టీటీడీ ఆలయంలో భక్తులకు విశేష దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులకు శ్రీవారి దర్శనం కల్పిస్తామని, దర్శనానికి వచ్చే భక్తులకు విరివిగా ప్రసాదాలు అందించబడతాయన్నారు. 30 వేల మంది భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తుల సదుపాయాల కోసం మొబైల్ టాయిలెట్లు, తాగునీరు, టీటీడీ డెయిరీలు, క్యాలెండర్ అందుబాటులో ఉంచామని, పంచగవ్య అగర్‌బత్తీలు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంటాయని, భక్తులు ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

ప్రత్తిపాడు: రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల కదలికలపై నిత్యం ప్రత్యేక నిఘా ఉంచాలని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా అన్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషనులోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, వాటి పురోగతికి తీసుకోవలసిన చర్యలపై సీఐ ఎం.వి. సుబ్బారావు, ఎస్‌ఐ డి. రవీంద్ర బాబులతో చర్చించారు. పెండింగ్ కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓర్పుతో విని పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించి ప్రజా జీవితానికి ఆటంకం కలిగించే వ్యక్తులను ఉపేక్షించవద్దని, ప్రత్తిపాడులో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఎస్‌ఐకు స్పష్టం చేశారు. విద్యా సంస్థల్లో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పేదలకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్సీ మురుగుడు, పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి
- దుగ్గిరాలలో విద్యార్థులకు ట్యాబులు పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: పేదలకు కార్పొరేట్ విద్యను అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి దేశ చరిత్రలోనే చారిత్రాత్మకమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కొనియాడారు. శుక్రవారం నియోజకవర్గంలోని దుగ్గిరాల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీపీ దానబోయిన స్వరూపవాణి, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజిలతో కలసి విద్యార్థులకు ట్యాబ్‌లతోపాటు జగనన్న భూరక్ష పథకంలో భాగంగా కొండూరు గ్రామ రైతులకు భూ పట్టాలు పంపిణీ చేశారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజచార్యులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల కంటే మెరుగైన నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నాడు–నేడు పేరుతో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. సమాజంలో పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందనే అంబేడ్కర్ ఆశయాలతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకుని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జగనన్న భూరక్ష పథకంతో రైతులకు ఎలాంటి ఆందోళన లేకుండా ధృవీకరణ పత్రాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు, వడ్డేశ్వరపు రజనీకాంత్, ఎంపీడీవో దేవరపల్లి వీరయ్య, తహసీల్దార్ మల్లీశ్వరి, ఎంఈఓ కాజ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పలుకూరి మేరిమ్మ, గంపల గంగాధర్, ఉన్నం ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యులు పెద్దేటి కావ్య, కూచిపూడి సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షహేలానర్గీస్

విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం కృషి

ఫిరంగిపురం: విద్యార్థుల ఉన్నతికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ అన్నారు. మండలంలోని పానుగుపాడు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కత్తిరేణమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు ట్యాబ్‌లు సాంకేతికంగా దోహదపడతాయని చెప్పారు. అనంతరం విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్.షహేలానర్గీస్‌లు ట్యాబ్‌లు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంఈవో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధిలో ఏపీ దేశానికే ఆదర్శం

మంగళగిరి: విద్యారంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శమని, విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి పేదలకు నాణ్యమైన విద్యను అందించడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. నగరంలోని వీవర్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఎమ్మెల్సీ హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవితో కలసి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఏడుకొండలు, పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, గుండా మధు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్యసురక్ష ఎంతోదోహదం

ఫిరంగిపురం: పేదవారికి జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతగానో దోహదపడుతుందని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. 83మందికి రోగులకు రక్త, మల, మూత్ర పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. శీతాకాలంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా రోగాల బారినుండి తప్పించుకోవచ్చని చెప్పారు. దోమల ఉధృతి తగ్గేందుకు మురుగు కాలువల్లో నీరు నిలువ ఉండేలా కాకుండా చూసుకోవాలన్నారు. వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, గోరు వెచ్చటి మంచినీటిని తాగాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, హెచ్‌ఏ బాబురావు, ఏఎన్‌ఎం అంతోనిరాణి, ఆశాకార్యకర్తలు సుజాత, పద్మ, శాంతకుమారి, శాంతరాణి, జోజమ్మలు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు శ్వేత

బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు జనవరి 2వ తేదీ నుంచి బ్రిడ్జి కోర్సు నిర్వహించనున్నట్లు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2 నుంచి 31 వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జెరాక్స్‌లు, రెండు ఫోటోలతో తమ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. వివరాలకు సెల్ నెం. 90144 91772, 93477 95839లో సంప్రదించాలన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్

- ఫిర్యాదులు, అర్జీల నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది
- కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పని చేసే కార్మికులు సమస్యల పరిష్కారానికి ప్రతి వారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించాలని, గ్రీవెన్స్ లో అందే ఫిర్యాదులు, అర్జీల నిర్వహణకు విభాగంలో సిబ్బందిని కేటాయించాలని డిప్యూటీ కమిషనర్, ఎంహెచ్‌ఓని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు వర్కర్స్ గ్రీవెన్స్ కమిషనర్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విభాగాల వారీగా కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి వారం వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహించాలని, గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీల రికార్డ్ నిర్వహణకు విభాగంలో ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. మరణించిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఎటువంటి అవినీతికి పాల్పడినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్మికులు తమకు అందే జీతాలు, ఇతర అలవెన్స్‌లకై ఎవ్వరికీ ఎటువంటి నగదు ఇవ్వాల్సిన పనిలేదని, ఎవరైనా నగదు డిమాండ్ చేస్తే ప్రతి శుక్రవారం జరిగే గ్రీవెన్స్‌లో నేరుగా తమ దృష్టికి తేవాలన్నారు. కార్మికుల పీఎఫ్ లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ని ఆదేశించారు. వార్డ్ సచివాలయాల వారిగా ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు తమ పరిధిలోని కార్మికులకు ఉన్న పీఎఫ్ సమస్యలపై రిపోర్ట్ ఇవ్వాలన్నారు. పీఎఫ్ సంబంధిత విధులపై కంప్యూటర్ ఆపరేటర్‌కి శిక్షణ ఇవ్వాలన్నారు. మరణించిన, 60 ఏళ్లు నిండిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను మానవతా దృక్పథంతో నియమించడానికి చర్యలు తీసుకుంటున్నామని, అందుకు అవసరమైన డాక్యుమెంట్స్ వివరాలు కార్మికులకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ కె.రవీంద్ర, ఎస్.ఈ. సుందరరామిరెడ్డి (ఎఫ్ఏసీ), ఎంహెచ్‌ఓ (ఎఫ్ఏసీ) మధుసూధన్, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల నుంచి అర్జీల స్వీకరణ

కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యల పై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వార్డుల వారీగా కార్పొరేటర్లు అందించిన అర్జీలు, వాటి పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కమిషనర్ తో చర్చించడానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా సమయం కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన రోజుల్లో కూడా కార్పొరేటర్లకు అందుబాటులో ఉంటామని, వాట్సప్ లో సమస్యలు తెలిపినా కూడా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

నిర్దేశిత గడువు లోగా పనులు పూర్తి చేయాలి

నగరంలో టెండర్ పొందిన కాంట్రాక్టర్లు అభివద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్ లో నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు నిర్వహించే కాంట్రాక్టర్ల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేశామన్నారు.

క్రైస్తవం ఒక జీవన విధానం



మాట్లాడుతున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉద్యోగులు, విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీ ఎదురుగా ఉన్న పాస్టరల్ ట్రైనింగ్ సెంటర్లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. వేడుకల్లో పాల్గొన్న వీసీ ఆచార్య పి. రాజశేఖర్ మాట్లాడుతూ 45 ఏళ్లుగా ఈ వేడుకలు జరుపుతున్నారన్నారు. ఈ వేడుకలు ప్రతీ ఏటా జరగాలనీ కుల, మత, వర్గాలకతీతంగా వేడుకల్లో యూనివర్సిటీ కుటుంబం పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతగా మెలగాలన్నారు. క్రైస్తవ మతం ఒక జీవిత విధానం అన్నారు. సమాజాన్ని చదవాలని సూచించారు. పాస్టర్ పరిశుద్ధ రావు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్దయ్య, పీజీ పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య ఉదయ్ కుమార్, న్యాక్ డైరెక్టర్ ఆచార్య సంధ్య కోల్ , డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్, ఇంజనీర్ కుమార్ రాజా, డెప్యూటీ ఇంజనీర్ కంకణాల సుబ్బారావు, వికాస అధ్యక్షుడు టి అనిల్ కుమార్‌పాల్గొన్నారు.

గ్లోబల్ దయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో

గుంటూరు మెడికల్: క్రీస్తు జననం సర్వజనానికి పర్వదినం అని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. స్థానిక కొత్తపేటలోని కింగ్‌డమ్ గాస్పల్ చర్చ్‌లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు డీఎంహెచ్‌ఓ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బిషప్ కొలగాని శ్యామ్‌సన్ రాబర్ట్, రెవరెండ్ కే.రాజకుమారి ప్రపంచ శాంతిగురించి ప్రత్యేక ప్రార్థనలు చేసి బైబిల్ సందేశాన్ని వివరించారు. గ్లోబల్ దయాగ్నస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట లక్ష్మణ్ ఏర్పాటు చేసిన కేక్‌ను డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు కట్ చేశారు. కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గుంటూరు జిల్లా ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి, రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈరి రాజశేఖర్, ఏపీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మేడిద బాబురావు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు మెడికల్ : ప్రభుత్వ ఆసుపత్రి మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, అసోసియేషన్ నేతలు ఎం. జ్యోతి బాబు, డి సాంబశివరావు, బొట్టు శ్రీను, ఏడి పాల్ సుధాకర్, ఏఓ పి శ్రీనివాస్, మేనేజర్ మురళి, విజయ కుమార్ అకౌంటెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు సోదరభావంతో మెలగాలి

సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు



కోర్టు ఆవరణలో కేక్ కట్ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు

మంగళగిరి: ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని మంగళగిరి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు అన్నారు. నగరంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసిన జడ్జి నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ శాంతి, సహనం అవసరమని, ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిలు సీహెచ్‌వీ రామకృష్ణ, వి శ్రీప్రత్యూష, పాస్టర్‌లు కొడమల జోసెఫ్, న్యాయవాదులు జొన్నాదుల లెనిన్‌బాబు, వి నాయుడమ్మ, తోట నరసింహారావు, ఏజీపీ క్రోసూరి చంద్రశేఖర్, ఏపీపీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరణ

న్యూ ఇయర్ ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న రాహుల్ సిప్ గంజ్..

గుణదల(విజయవాడ తూర్పు): నూతన సంవత్సర వేడుకల్లో యువతను ఉర్రూతలూగించే దిశగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు ఐకా ఇవెంట్ ఆర్గనైజేషన్ సంస్థ సీఈఓ డి.జయదుర్గ అన్నారు. గుణదల హయత్ ప్లేస్ హోటల్‌లో ఐకా న్యూ ఇయర్ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. జయదుర్గ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీన మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో అట్టహాసంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఆస్కార్ అవార్డు పొందిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో నాటు నాటు అంటూ పాడిన గాయకుడు రాహుల్ సిప్లి గంజ్ ఈ వేడుకలకు హాజరు కానున్నారని తెలిపారు. తన బృందంతో పాప్ సాంగ్స్ పాడి యువతను ఉర్రూతలూగిస్తారని పేర్కొన్నారు. అనంతరం న్యూ ఇయర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐకా సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

వెనుకబడిన కులాలకు శాపంగా మారిన చట్టాల్లోని లోపాలు



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు

మంగళగిరి: రాజకీయ రిజర్వేషన్ చట్టాలలో లోపాలు వెనుకబడిన కులాలకు శాపంగా మారాయని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ చెప్పినట్లు రాజ్యాధికారం అందుకోలేని జాతులు అంతరిస్తున్నాయని అన్నారు. 1952 నుంచి ఎస్సీ, ఎస్టీ వారికి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంలో జనాభా దామాషా పద్ధతిలో రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నారని వెనుకబడిన వర్గాలకు మాత్రం రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికలలో బీసీ అభ్యర్థులపై మరొక పార్టీ బీసీ అభ్యర్థులను మాత్రమే పోటీ చేయించాలని అలా చేయని పక్షంలో మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కొమ్మర క్రాంతికుమార్, పారేపల్లి మహేష్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కొల్లూరు హనుమంతరావు, గుర్రం ద్వారకా శ్రీను, కాగితాల స్వాతిగౌడ్, ఆలా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు రూ.48 వేల జరిమానా



వాహన తనిఖీలో అధికారులు, సిబ్బంది

తెనాలిరూరల్: సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడుపుతున్న వారికి అధికారులు జరిమానా విధించారు. రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో వాహన తనిఖీల ప్రత్యేక డ్రైవ్‌ను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. చేబ్రోలు మండలంలోని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల వద్ద నిర్వహించిన తనిఖీల్లో ప్రాంతీయ రవాణా అధికారి కె. ప్రసాద్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌టీ మధుసూదనరావు, చేబ్రోలు ఎస్‌ఐ ఆనంద్ ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 7 వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. వాహనదారులకు రూ.48 వేలు జరిమానా విధించారు. వాహనదారులు అన్ని పత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, కార్పొరేటర్లు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తుందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీలను ఈ నెల 26 న గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని లయోలా స్కూల్ లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ కీర్తి చేకూరి, కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి ఆడుదాం ఆంధ్ర ద్వారా క్రీడలలో ప్రతిభావంతులను గుర్తించి తగిన ప్రోత్సాహం ఇవ్వనున్నారన్నారు. ఆడుదాం ఆంధ్రలో భాగంగా గుంటూరు నగరంలోని 206 సచివాలయాల పరిధిలో 40 వేల మందికి పైగా పోటీలలో పాల్గొనే అవకాశం ఉందని, క్రీడా పోటీలకు అనుగుణంగా నగరంలో 19 గ్రౌండ్ లను సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం పోటీల బ్రోచర్స్ ను ఆవిష్కరించి కిట్స్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, డిప్యూటి కమీషనర్ వెంకట కృష్ణయ్య, డి.యస్.డి.ఓ వెంకటేశ్వర రావు, కార్పొరేటర్లు, శాప్, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా మేరీ సరోజినీ

గుంటూరు మెడికల్: న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యురాలుగా గుంటూరుకు చెందిన బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ కత్తి మేరి సరోజినిని నియమించారు. తనను రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా నియమించినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రయాణీకుల సమస్యలను రైల్వే అధికారులకు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.